క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

అయిజ: మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభించనున్న సమావేశానికి సంబంధిత సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన నివేదికలు సమర్పించాలని సూచించారు. సమావేశానికి హాజరుకాని సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ



కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె శ్రీరాఘవేంద్ర పాఠశాలలోని జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా గురువారం విద్యార్థులకు ఏఎన్ఎం సురేఖ అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో 1-19 సంవత్సరాల విద్యార్థులు అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాఘవేంద్ర, వెంకటేష్, రాజు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించండి

ఆత్మకూర్: గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి వర్షాకాలంలో శానిటేషన్, ఇంకుడు గుంతలు, హరితహారం, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఆత్మకూర్, మదనాపురం మండలాల ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు లేని కుటుంబాలను గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు చొరవ చూపాలని ఆదేశించారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్‌తో పాటు దోమల నివారణ కోసం మందులను పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో మదనాపురం మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్, ఆత్మకూర్ ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ నరసింహరావు, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్ద గూడెంతండాలో గురువారం చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ రాఘవ పరిశీలించారు. గ్రామంలో డ్రైనేజీలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ నర్సరీని సందర్శించి, మొక్కల పెరుగుదలకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల రద్దుపై అధికారుల విచారణ



పాన్‌గల్: మండలంలో తొలగించబడిన ఆసరా పింఛన్లపై బుధవారం మండల కేంద్రంలోని పోస్టాఫీసులో జిల్లా డీఆర్‌డీఓ అధికారులు విచారణ జరిపి పూర్తి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డీపీఎం ప్రభాకర్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆసరా పింఛన్లు పొందుతున్న వారిలో నలుగురికి పింఛన్లు రద్దు చేశారని, వాటిపై వారి కుటుంబ, ఆధార్ వివరాలను సేకరించి జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు. ఈ విధంగా మండలంలో 46 మందికి సంబంధించిన పింఛన్లు రద్దయినట్లు ఆయన పేర్కొన్నారు. రద్దయిన వారి వివరాలను గ్రామాల వారీగా సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీసీ పరశురాం, పోస్టుమెన్ రాంచందర్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు



వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్య అభ్యసిస్తున్న చిన్నారులకు గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పుల్గర్‌చర్ల, సంగినేనిపల్లి, బొల్లారం తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల బరువులను తీసి వారి ఆరోగ్య రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు.

పుష్కరఘాట్లలో రక్షణేది?



పుష్కరఘాట్ దగ్గర పూర్తిగా కొట్టుకుపోయిన రక్షణ కంచెలు

- వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఇనుప కంచెలు
- ప్రమాదాల బారిన పడుతున్న భక్తులు
- పట్టించుకోని అధికారులు



వరద ఉధృతి వల్ల పూర్తిగా ధ్వంసమైన రక్షణ కంచెలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కృష్ణానది దగ్గర పుష్కరఘాట్లలో భక్తుల రక్షణ కరువైంది. ఇనుప కంచెలు వరదల వల్ల గతంలో పూర్తిగా ధ్వంసమై కొట్టుకుపోయాయి. దీనివల్ల పుష్కరఘాట్లన్నీ భక్తులకు రక్షణ లేకుండా మారాయి. దీనివల్ల పుష్కరఘాట్లు నిత్యం ప్రమాదాలకు తావునిస్తూ ప్రమాద భరితంగా ఉండటంతో అక్కడికి వచ్చే భక్తులు ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలంలో నిర్వహించే బీచుపల్లి ఆంజనేయస్వామి ఉత్సవాలతో పాటు వినాయక నిమజ్జనం ఉత్సవాలకు వేల సంఖ్యలో భక్తులు ఇక్కడికి వస్తుంటారు. పుష్కరఘాట్లలో సరైన భద్రత లేకపోవడంతో ఎంతో మంది యువకులు ప్రాణాలను కోల్పోయారు. కానీ ఎన్ని ప్రమాద సంఘటనలు జరిగినా అధికారుల తీరులో మాత్రం ఎలాంటి మార్పు రాలేదని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడంలేదు..

పుష్కరఘాట్లలో ఇనుప కంచెలు లేకపోవడం వల్ల పలుమార్లు ప్రమాదాలు జరిగి భక్తులు ప్రాణాలు కోల్పోయినా అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు స్థానిక ప్రజా ప్రతినిధులకు, ఆలయ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని భక్తులు పేర్కొంటున్నారు. వరదల తర్వాత కంచెలను ఏర్పాటు చేయకపోవడంతో నదిలో స్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులకు రక్షణ కరువైందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పుష్కరఘాట్లలో ఇనుపకంచెలను ఏర్పాటు చేసి భక్తులు ప్రమాదాల బారిన పడకుండా రక్షణ కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

నిత్యం వందల సంఖ్యలో భక్తులు రాక..

బీచుపల్లి పుణ్యక్షేత్రంలో అభయాంజనేయ స్వామి, కోదండరామస్వామి, /జ్ఞాన సరస్వతి ఆలయాలతో పాటు శివాలయం, ప్రముఖమైన పలు ఆలయాలు ఉండటంతో నిత్యం వందల సంఖ్యలో భక్తులు బీచుపల్లి క్షేత్రానికి వస్తుంటారు. వచ్చిన భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆయా ఆలయాలలో మొక్కులు తీర్చుకొని వెళ్తుంటారు. పుష్కరఘాట్లలో స్నానాలు చేసే దగ్గర, కృష్ణమ్మ విగ్రహం దగ్గర రక్షణకోసం ఏర్పాటు చేసిన ఇనుపకంచెలు సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాలు తప్పడం లేదని భక్తులు వాపోతున్నారు. ప్రతి ఏటా నెల రోజులపాటు అంగరంగవైభవంగా నిర్వహించే బీచుపల్లి జాతర సమయంలో, వినాయక నిమజ్జనం సమయంలో భక్తులు వేల సంఖ్యలో రావడంతో ప్రమాదాలు సంభవించిన సంఘటనలు చాలానే ఉన్నాయి.



ధ్వంసమైన రక్షణ కంచెపై కూర్చున్న యువకులు

ప్రమాదాల బారిన పడుతున్నారు..



పుష్కరఘాట్ దగ్గర ఇనుప కంచెలు సక్రమంగా లేకపోవడంతో యువత అధికంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా వినాయక నిమజ్జనం రోజు రాత్రివేళల్లో భక్తులు అధికంగా రావడంతో రక్షణకు ఏర్పాటు చేసిన ఇనుప కంచెలు లేకపోవడంతో గమనించక ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. కొంతమంది యువకులు ఘాట్లలో సెల్ఫీలను దిగుతూ రక్షణ కంచెలు లేకపోవడంతో ప్రమాదంలో పడి ప్రాణాలను సైతం పోగొట్టుకున్నారు.

– నరేష్, భక్తుడు.

రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలి...



పుష్కరఘాట్లలో వరదల కారణంగా భక్తుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన కంచెలు పూర్తిగా కొట్టుకుపోవడం వల్ల భక్తులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి ఆదివారం సెలవు ఉండడంతో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పర్యాటకులు కుటుంబ సభ్యులతో కలిసి అధికంగా వస్తుంటారు. భక్తుల రక్షణకోసం తక్షణమే అధికారులు ఇనుప కంచెలను ఏర్పాటు చేసి పుష్కరఘాట్లలో ప్రమాదాల నివారణకు కృషిచేయాలి.

– అశోక్‌కుమార్‌రెడ్డి, భక్తుడు

అధికారులకు విన్నవించాం..



పుష్కరఘాట్లలో ఇనుప కంచెలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలుమార్లు స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు జిల్లా అధికారులకు కూడా గతంలో విన్నవించాం. కానీ ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ప్రమాదాలు మాత్రం తరుచుగా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే భక్తులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలి.

– నర్సమ్మ, మాజీ సర్పంచ్, బీచుపల్లి పంచాయతీ

ఎస్పీని కలిసిన పదో బెటాలియన్ కమాండెంట్



ఎస్పీకి మొక్కను అందిస్తున్న కమాండెంట్ సాంబయ్య

ఎర్రవల్లిచౌరస్తా: జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు (ఐపీఎస్)ను గురువారం బీచుపల్లి పదో బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఆయనను కమాండెంట్ మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట అసిస్టెంట్ కమాండెంట్ చౌహాన్, పటాలం అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం



మానవపాడు సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌నాయుడు

మానవపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌నాయుడు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు బస్సు ఫ్రీ, రూ.500కు గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి కింద 200యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేస్తోందని, రైతులకు రూ.2లక్షలు తప్పనిసరిగా ఆగస్టు లోపల కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని తెలిపారు. రైతులకు రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నారాయణనాయుడు, శంకర్‌నాయుడు, చంద్రమౌళి, ఖలీల్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

అయిజ: మండలంలోని మేడికొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఉపాధ్యాయులు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తిమ్మారెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీతో పాటు దుస్తులు అందజేస్తుందని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు ప్రైవేట్ పాఠశాలల్లో ఉండవని తెలిపారు. విద్యార్థులు శ్రద్ధతో చదువుకొని ఉపాధ్యాయులకు, తల్లి దండ్రులకు మంచిపేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్న తిమ్మప్ప, రామ నాయుడు, నరసింహులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్ జ్యోషి

శాంతినగర్: సమాజంలో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ జ్యోషి అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని ఐకేపీ భవనంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి యువజనుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ యువకులు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కలిగి ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. యువకులు మంచి మార్గంలో ఉంటే భవిష్యత్‌లో బాల్యవివాహాలు, బాల కార్మికులు ఉండరాదన్నారు. యువకులు మాదకద్రవ్యాలకు, మద్యపానానికి అలవాటుపడరాదన్నారు. బడిబయటి పిల్లలను బడుల్లో చేర్పడానికి యువకులు ముందుకు రావాలన్నారు. బాల్యవివాహాలు చేసుకోకుండా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంవీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. పాఠశాలలు దూరంగా ఉన్న గ్రామాల విద్యార్థులకు కేజీబీవీల్లో సీట్లు ఇవ్వాలని, గ్రామాల నుంచి మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సులు నడపాలని కోరారు. సమావేశంలో ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, వడ్డేపల్లి, రాజోళి మండలాల యువకులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా ఆస్పత్రి భవనం



మద్యం సీసాలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మండల కేంద్రంలో నిర్మిస్తున్న 30 పడకల ఆస్పత్రి (మాత శిశు సంరక్షణ కేంద్రం) భవనం మందుబాబులకు అడ్డాగా మారిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం బీజేపీ నాయకులు ఆ భవనాన్ని పరిశీలించారు. భవనంలో మద్యం సీసాలు, ఆహార వ్యర్థ పదార్థాలు పడి ఉండడం గమనించారు. ఆ భవనం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన నిర్మాణం అసంపూర్తిగా మిగిలి పోయిందని వాపోయారు. వాటికి తలుపులు లేకపోవడంతో మందుబాబులు ప్రతిరోజు భవనంలో కూర్చోని మద్యం తాగుతున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వాపోయారు. పక్కన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉందని, ప్రతిరోజు వందల సంఖ్యలో ఓపీలు వస్తుంటారని తెలిపారు. మందుబాబులు చేసే వికృత చేష్టలకు ఆస్పత్రికి వచ్చే ప్రజలు, పీహెచ్‌సీలో పనిచేసే సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారని మండిపడ్డారు. వెంటనే నిర్మాణం పనులు పూర్తిచేసి ఆస్పత్రిని ప్రారంభించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

యువతి అదృశ్యం

ఉండవెల్లి: మండలంలోని తక్కశిల గ్రామానికి చెందిన యువతి(19) కనబడకపోవడంతో గురువారం తల్లి అక్బర్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వీరన్న తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం తక్కశిల గ్రామానికి చెందిన అక్బర్‌బీ, తాత, అమ్మమ్మ యువతి అందరు కలిసి ఒకే ఇంట్లో నివాసముంటున్నారు. తల్లి కూలిపనికి వెళ్లింది. దీంతో యువతి తాతతో బయటికి వెళ్లివస్తానని చెప్పి వెళ్లింది. సాయంత్రం తల్లి వచ్చి చూడగా బిడ్డ కనిపించలేదు. ఇంటికి రాకపోవడంతో తెలిసిన వాళ్లను, బంధువులతో లేకపోవడంతో తల్లి ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కానిస్టేబుల్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



ఆస్పత్రిలో కానిస్టేబుల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌ను ఎమ్మెల్యే విజయుడు గురువారం పరామర్శించినట్లు తెలిపారు. అలంపూర్ మండలం సింగవరానికి చెందిన కానిస్టేబుల్ కడుపు నొప్పి సమస్యతో కర్నూల్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆస్పత్రికి వెళ్లి కానిస్టేబుల్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి వైద్యులతో మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. వారితో పాటు నాయకులు సూరి, రంగన్న, తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమావేశం



మానవపాడు సమావేశంలో చర్చిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

మానవపాడు: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యాలయానికి సంబంధించిన 7 రిజిస్టర్లపై కార్యదర్శులకు, టెక్నికల్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దిమ్మెలు పగిలినా.. పట్టింపేది?



బస్వాపురం గ్రామ ప్రారంభంలో పడిపోయిన దిమ్మెలు

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో హరితహారంలో భాగంగా మొక్కలు నాటిన క్రమంలో గ్రామ ప్రారంభంలో గతంలో దిమ్మెలు ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం అన్ని గ్రామాల్లో దిమ్మెలు పగిలిపోయాయి. వాటిని ఏ అధికారి పట్టించుకోకపోవడంతో అన్ని ఎక్కడ పడిన దిమ్మెలు అక్కడే మట్టిలోనే ఉండిపోయాయి. వేలల్లో ఖర్చు పెట్టి నిర్మించిన దిమ్మెలు పగిలిపోయి కింద పడినా అధికారులు, కార్యదర్శులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని, దీని ద్వారా ప్రజాధనం వృథా అయ్యిందని ప్రజలు పేర్కొంటున్నారు.

ఫైనాన్స్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న గోవర్ధనగిరి బాధితులు

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరికి చెందిన బొలమోని ఆంజనేయులు అనే ఫైనాన్స్ వ్యాపారి గ్రామంలోని 22 మంది నుంచి డబ్బులు తీసుకొని పారిపోయాడని, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం పలువురు బాధితులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పెబ్బేరు పట్టణంలో ఫైనాన్స్ కంపెనీ నిర్వహిస్తున్నానని నమ్మబలికి గ్రామంలోని 22 మందితో డబ్బులు వసూలు చేసి పారిపోయాడని బాధితులు గూడెం సాయిలు, విజయ్‌కుమార్, ఆకుల బీసన్న, మదుగం కురుమన్న, కొట్టం లక్ష్మయ్య, ముంత కురుమన్న, రాముడు, చంద్రమ్మలు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తికి వివరించారు. తమ గ్రామంలోనే దాదాపు రూ.80 లక్షల వరకు వసూలు చేశారని వారు పేర్కొన్నారు. గ్రామంలోని పేద రైతులు, కూలీలను మోసం చేసి డబ్బులు తీసుకొని ఉడాయించిన ఆంజనేయులుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

నిత్యావసర సరుకుల ధరలు పైపైకి..

- పెరుగుతున్న కూరగాయల ధరలు
- పేద మధ్య తరగతి వర్గాలపై భారం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మల్దకల్ సంతలో కూరగాయల విక్రయాలు



మల్దకల్: నిత్యావసర వస్తువుల ధరలతో పాటు కూరగాయల ధరలు పెరుగుతుండడంతో మధ్య తరగతి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదివరకు రూ.200లతో సంత, మార్కెట్‌కు వెళ్తే వారం రోజుల పాటు సరిపోయే కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం రూ.500లు ఖర్చు చేయాల్సి వస్తోంది. జిల్లాలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ప్రధానంగా జిల్లాలో టమాటతో పాటు ఇతర కూరగాయలు, ఆకుకూరల సాగు ఎక్కువగా లేకపోవడంతో ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం టమాట ఇతర ప్రధాన కూరగాయలు పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. ట్రాన్స్‌పోర్టు ఖర్చులు అధికంగా ఉండటంతో కూరగాయల ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

వర్షాలపైనే ఆశలు

కొద్దిరోజులుగా భానుడి ప్రతాపంతో కూరగాయల సాగు ఇబ్బందిగా మారింది. మల్దకల్ సంతతో పాటు గద్వాల కూరగాయల మార్కెట్‌కు వివిధ పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి కూరగాయలు ఎక్కువగా వస్తుంటాయి. దీంతో పాటు ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి కూరగాయలతో పాటు ఆకుకూరలు కూడా అందుబాటులో ఉండేవి. ఎంత త్వరగా వర్షాలు కురిస్తే కానీ జిల్లాలో సాగుచేసే కూరగాయలు అందుబాటులోకి వస్తాయని, ధరలు తగ్గుతాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

కూరగాయల ధరలు కిలోకు రూపాయలలో

కూరగాయలు	మే	ప్రస్తుతం
టమాట	40	100
దొండకాయ	40	60
పచ్చిమిర్చి	50	100
బీరకాయ	50	80
వంకాయ	30	60
కాకరకాయ	40	80
చిక్కుడుకాయ	60	100
క్యారెట్	40	60

టమాటకు కొరత..

ప్రధానంగా ప్రతి వంటలోను టమాటను వాడుతుంటారు. 20రోజుల కింద టమాట రూ.40-50లు ఉండగా ప్రస్తుతం రూ.80-100లకు చేరింది. దీంతో కిలో టమాట కొందామంటే ధైర్యం రావడం లేదు. పావుకిలో టమాటతో సర్దుకుపోతున్నారు. వంకాయ, కాకరకాయ, బీరకాయ, దొండకాయ, చిక్కుడుకాయ ఇలా ప్రతిదానిపై కిలోకు రూ.40-60వరకు పెరిగాయి.

ప్రతి కూరగాయ ధర రెట్టింపు..



నిత్యవసర సరుకులతో పాటు కూరగాయలు ప్రతి నెల పెరుగుతూనే ఉన్నాయి. గతంలో నెలరోజులకు సరిపడిన వంటింటి ఖర్చులతో పోల్చితే ఇప్పుడు పెరిగిపోయాయి. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పద్మమ్మ, గృహిణి, అమరవాయి

నష్టాలు తప్పడం లేదు..



వేసవిలో కూరగాయలు రావడమే తక్కువ. తప్పని పరిస్థితిలో అమ్మాల్సి వస్తోంది. ఎండ వేడిమికి కూరగాయలు ఒక రోజుకు తప్ప ఎక్కువ రోజులు నిల్వ ఉండడం లేదు. వర్షాలు కురిస్తే కానీ సంతకు కల వచ్చేది లేదు. ఇతర ప్రాంతాలను నుంచి కూరగాయలు వస్తుండడంతో ధరలు పెరుగుతున్నాయి.

– జయమ్మ, కూరగాయల వ్యాపారి, మల్దకల్